బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

విద్యార్థి లెక్క... ఇక పక్కా...

ప్రతిరోజు పాఠశాలలకు పిల్లలు వస్తున్నారా? లేదా? తరగతి గదిలో పిల్లలు ఉంటున్నారా? లేదా? అనే విషయం తెలియాలంటే అటెండెన్స్ తీసుకోవటం తప్పనిసరి. అయితే ఒకప్పుడు ఉపాధ్యాయులు పిల్లల పేర్లు లేదా వారి రోల్‌నెంబర్ ఆధారంగా అటెండెన్స్ తీసుకునేవారు. దీనికోసం హాజరు పట్టిక (రిజిస్టర్లు)లు ఉపయోగించేవారు. దీనికి చాలా సమయం వృథా అయ్యేది. ఆ తర్వాత పిల్లలకూ బయోమెట్రిక్ విధానం తీసుకువచ్చారు. ఈ బయోమెట్రిక్‌లో అటెండెన్స్ వేసుకోవడం కూడా సమయంతో కూడుకున్నదే. ఈ వృథా కాలాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తాజాగా ఫేస్ రికగ్నేషన్ సిస్టం యాప్‌ను తీసుకొచ్చింది.

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి చేర్చే క్రమంలో ప్రభుత్వం అనేక ఆధునిక సౌకర్యాలను కల్పిస్తున్నది. అందులో భాగంగా బయోమెట్రిక్ విధానాన్ని కూడా మార్చనున్నది. ఉపాధ్యాయులు తీసుకున్నటువంటి బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, రాగిజావను అందించేవారు. ఈ మధ్యనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌ను కూడా ప్రవేశపెట్టింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగానే వంట ఏజెన్సీ వాళ్లకు మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించేవారు. విద్యార్థుల హాజరుశాతం తెలుసుకునేందుకు బయోమెట్రిక్ అమలు చేసినా అది ఆశించినంత ఫలితాన్ని ఇవ్వలేదు. అందుకే ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ సిస్టంయాప్‌ను తీసుకొచ్చింది. పాఠశాలకు హాజరైన విద్యార్థి లెక్క ఇకనుంచి పక్కాగా ఉండడానికి ఉపాధ్యాయుడు సెల్‌ఫోన్‌లో గాని, ట్యాబ్‌లో గాని ఒక క్లిక్ చేస్తే చాలు పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్య ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అయ్యే విధంగా ఈ యాప్‌ను రూపొందించింది. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందించే ప్రతి సంక్షేమ సౌకర్యాలకు ఈ ఆన్‌లైన్ వివరాలే ఆధారం కానున్నాయి.

> కొన్నిచోట్ల పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చూపిస్తూ మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడుతుండడాన్ని అధికారులు గుర్తించారు. దీన్ని నివారించడం కోసమే ఈ ఫేస్ రికగ్నేషన్ సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. రానున్న రోజుల్లో మధ్యాహ్న భోజన చెల్లింపులను మరింత సులభతరం చేసి పేపర్ లెస్ విధానాన్ని అమలు చేయడానికి ఈ యాప్ ఉపయోగపడనున్నది.

ఈ యాప్‌తో విద్యార్థులను తరగతి వారిగా ఒకేసారి అందరూ విద్యార్థులు వచ్చేలా పోటో తీయడంతో ఆన్‌లైన్‌లో హాజరు నమోదవుతుంది. ప్రస్తుతం ఈ యాప్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్నది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడం కోసం డీఈవో కార్యాలయం ద్వారా వచ్చిన లింకుపై క్లిక్ చేసి లేదా ప్లే స్టోర్ నుంచి డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను పాఠశాల హెచ్ఎం తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్ చేసిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అడుగుతుంది కాబట్టి దాన్ని కూడా తీసుకోవాలి. యూజర్ ఐడీ వద్ద స్కూల్ డైస్ కోడ్, పాస్‌వర్డ్ వద్ద స్కూల్ ఎట్ ది రేట్ ఆఫ్ వన్ టూ త్రీ లేదా వారికి నచ్చిన నంబర్‌ను ఎంటర్ చేసి లాగిన్‌పై క్లిక్ చేయాలి. స్టూడెంట్ రిజిస్ట్రేషన్, స్టూడెంట్ అటెండెన్స్, డీటెయిల్స్ రిపోర్ట్ అని మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. స్టూడెంట్ రిజిస్ట్రేషన్ పై క్లిక్ చేస్తే సదరు స్కూల్లో ఉన్న విద్యార్థుల మొత్తం సంఖ్య బ్లూ కలర్‌లో కనిపిస్తుంది. తరగతి టోటల్ విద్యార్థుల సంఖ్యపై క్లిక్ చేయాలి. ఆ తరగతిలోని విద్యార్థుల ఐడీలు కనిపిస్తాయి. స్టూడెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఆ విద్యార్థి పేరుపై క్లిక్ చేస్తే కెమెరా ఓపెన్ అవుతుంది. ఆ విద్యార్థి ఫేసును మొబైల్ కెమెరా సర్కిల్‌లో ఉంచి, స్టూడెంట్ ఫేస్‌పై గ్రీన్ సర్కిల్ లోపల క్లిక్ చేసి సబ్‌మీట్ చేయాలి. ఆ తరువాత పింక్ బటన్ పై క్లిక్ చేయాలి. దీంతో స్టూడెంట్ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. స్టూడెంట్ లిస్టు స్క్రీన్‌లో గ్రీన్ టిక్ మార్క్ చేయబడి ఉంటుంది. ఇలా తరగతిల వారీగా అందరు విద్యార్థులను రిజిస్ట్రేషన్ చేయాలి. స్టూడెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత స్టూడెంట్ అటెండెన్స్ పై క్లిక్ చేయాలి. మొబైల్ కెమెరాను అడ్డంగా ఉంచి తరగతిలోని అందరు విద్యార్థులు కనిపించేలా చూసి కెమెరా బటన్ పై క్లిక్ చేయాలి. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య హాజరు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఇంతకుముందు రిజిస్ట్రేషన్ అయి ఉండి, యాప్‌లో కెమెరా ఓపెన్ చేసినప్పుడు అందు బాటులో ఉన్న విద్యార్థులను మాత్రమే ఆరోజు పాఠశాలకు వచ్చినట్టు యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేస్తుంది.

ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో జిల్లాలో గవర్నమెంట్ లోకల్ బాడీ మేనేజ్‌మెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వారి సెల్ ఫోన్లలోను ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన ట్యాబుల్లో లేదా మొబైల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే ప్రధానోపాధ్యాయుడు క్షేత్రస్థాయిలో సీఆర్పీల ద్వారా సమస్యను ఎంఆర్సీలోని మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్ దృష్టికి తీసుకువెళ్లాలి అక్కడ పరిష్కారం కాకపోతే ఎంఐఎస్ ద్వారా డీఈవో కార్యాలయంలోని ఏఎస్ఓ సరిచేయడం జరుగుతుంది. రానున్న రోజుల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రతిరోజు పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు వస్తున్నారు పక్కాగా తెలవడానికి ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్ తోడ్పడుతుంది. తెలంగాణ వ్యాప్తంగా ఇది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోఅమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిద్వారా ఇటీవల ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ మొదలుకొని మధ్యాహ్న భోజనం, పిల్లలకు కల్పిస్తున్న వసతులు మొదలైనవన్నీ తెలుస్తాయి. దీనివల్ల విద్యార్థుల సంఖ్య ఖచ్చితంగా తెలి యడంతో పాటు హాజరుశాతం కూడా పెరుగుతుంది.

మోటె చిరంజీవి
99491 94327

మహారాష్ట్ర బడులు ప్రైవేటు పరం

ప్రభుత్వ పాఠశాలలను దత్తత ఇచ్చే పేరుతో ప్రైవేటు పరం చేసే కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కార్పొరేట్ సంస్థలు, వ్యక్తిగత దాతలు, సామాజిక సంస్థలు ఐదు లేదా పదేండ్ల పాటు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడానికి అనుమతించే ప్రతిపాదనను 2023 సెప్టెంబర్ 16న ఆమోదించింది. ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడమే తప్ప మరొకటి కాదు.

ప్రైవేట్ వ్యక్తులు పాఠశాలను నిర్వహించడం ద్వారా సిద్ధంగా ఉన్న భూమి, భవనాలను వాడుకొని లాభాన్ని పొందుతారు. నిజానికి నగరాలలో ముఖ్యంగా మెట్రోనగరాల్లో చాలా విలువైన ప్రభుత్వ పాఠశాలలు ప్రజల డబ్బుతో నిర్మించబడ్డాయి. ఇవి ఇప్పుడు ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్తాయి.

మహారాష్ట్రలో దాదాపు 62,000 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఖరీదైన ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించే స్థోమతలేని వారు ఈ బడులకు వెళ్తున్నారు. దత్తత నిర్ణయం వల్ల పేద విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నది. ప్రయివేటు వ్యక్తులు స్కూళ్లను తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత కొంత మేరకు ఫీజులు నిర్ణయిస్తారు. రెక్కాడితే గానీ డొక్కాడని తల్లిదండ్రులు ఆ ఫీజులు భరించలేరు కనుక చాలామంది పిల్లలు విద్యకు దూరం అవుతారు.

ఏ కార్పొరేట్ సంస్థ కూడా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండే సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలను దత్తత తీసుకోవడం లేదు. పాఠశాల ఆస్తులు కలిగి ఉండి, విలువైన భూమి, లాభాలను ఆర్జించే అవకాశం ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లోని స్కూళ్లపైనా వారు దృష్టి పెడుతున్నారు. కార్పొరేట్ సంస్థలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను పాఠశాలల నిర్వహణకు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కార్యక్రమం కింద 'ఏ', 'బీ' తరహా మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లోని పాఠశాలలను దత్తత తీసుకునే సంస్థలు ఐదేండ్లలో రూ.2 కోట్లు లేదా పదేండ్లలో రూ.3 కోట్లు ఖర్చు చేయడానికి కట్టుబడి ఉండాలి. 'సీ' రకం మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు అంచనా వేసిన విరాళం రూ.1 కోటి నుంచి రూ.2 కోట్లు, మిగిలిన పాఠశాలలకు వరుసగా ఐదు నుంచి పదేండ్లకు రూ. 50 లక్షలు నుంచి రూ.1 కోటి వరకు ఖర్చుచేయాలి. కార్పొరేట్ సంస్థలు ఖర్చు చేసిన మొత్తాన్ని ఫీజుల ద్వారా రికవరీ చేసే అవకాశం ఉన్నది. దీని ఫలితంగా చాలా కుటుంబాలు తమ పిల్లలను చదివించుకోలేక పోతున్నాయి. ఈ నిర్ణయం ద్వారా, ప్రభుత్వ విద్యకు నిధులు సమకూర్చే ప్రాథమిక బాధ్యతలలో ఒకదాన్ని ప్రభుత్వం వదులుకుంటున్నదనే విషయం స్పష్టమవుతున్నది.

ఆళ వందార్ వేణు మాధవ్
86860 51752



దక్షిణాదికి తీరని నష్టం

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-82, ఆర్టికల్-170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. కానీ గడచిన 50 ఏండ్లుగా నియోజకవర్గాల విభజన జరగలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.

దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002 లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించడం జరిగింది. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేయడం జరిగింది. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణానికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకోవడం జరిగింది. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు. అంటే గత 50 సంవత్సరాల నుంచి దేశంలో నియోజకవర్గాల పెరుగుదల నిలిచిపోయింది. దీనికి కారణం 1976 తరువాత దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ జనాభా నియంత్రణ కార్యక్రమాలను పాటించి జనాభాను నియంత్రణలోకి తెచ్చి దేశాభివృద్ధికి దోహదం చేశాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను అడ్డు అదుపు లేకుండా పెంచుకుంటూ పోయాయి. జనాభా నియంత్రణ చేసినందుకు శిక్షగా దక్షిణ భారత రాష్ట్రాలు తమ నియోజకవర్గాలు కోల్పోవాల్సి వస్తుంది. అదే ఉత్తర భారత రాష్ట్రాలు తాము చేసిన తప్పుకు బహుమతిగా నియోజకవర్గాలు పెరుగుతాయి. కనుక జనాభా నిష్పత్తి ఆధారంగా కాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి.

స్వతంత్రం వచ్చిన తరువాత దక్షిణ భారత రాష్ట్రాలు అన్ని రంగాలలో గొప్ప ప్రగతిని సాధించి ఈ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. జనాభా నియంత్రణను నియమబద్ధంగా పాటించడం వల్ల దేశ జనాభాలో 18శాతం మాత్రమే ఉన్నా దేశ జీడీపీలో 35శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే. ఇక తలసరి ఆదాయం విషయానికి వస్తే జాతీయ సగటు కంటే అధికంగా నమోదు చేసుకొని మొదటి 5 స్థానాలలో నిలుస్తున్నాయి. దేశంలో మిగతా 24 రాష్ట్రాలలో పోలిస్తే దక్షిణ భారత రాష్ట్రాలు ఆర్థికంగా అత్యంత బలంగా ఉన్నాయి. దేశంలో వసూలయ్యే పన్నుల వాటాలో అత్యధిక భాగం దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్నది. కానీ ఇక్కడి నుండి వచ్చే పన్నుల్లో అత్యధిక శాతం ఉత్తర భారతదేశంలో ఖర్చు చేస్తున్నారు. మానవాభివృద్ధి సూచి మొదలుకొని అన్ని అభివృద్ధి సూచిలలో దక్షిణాది రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. కాని దేశంలో ఎప్పుడో ఒకటి అర తప్ప అత్యధిక భాగం ఉత్తరాది నాయకుల పెత్తనమే ఉంటుంది. ఎందుకంటే అన్ని పార్టీలలో వారి సంఖ్య అత్యధికావడం వల్ల. కనుక ఉత్తరాది రాష్ట్రాలకు అత్యధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటికే అన్యాయానికి గురవుతున్న దక్షిణ భారత రాష్ట్రాలకు ఇప్పుడు జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పెంపుదల చేస్తే మరింత అన్యాయం జరుగుతుంది.

> జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని భారతీయ జనతా పార్టీ ఆలోచిస్తున్నది. ఒకవేళ అదే గనుక జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు మొత్తం కలిపి 165 స్థానాలు మాత్రమే ఉంటాయి. మిగిలిన 24 రాష్ట్రాలకు 683 స్థానాలు ఉంటాయి. ఇందులో కూడా అత్యధిక స్థానాలు గంగానది తీర ప్రాంత రాష్ట్రాలు, హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలకు లభిస్తాయి.

ఒక్క ఉత్తరప్రదేశ్‌లో 63 స్థానాలు పెరిగి 143 స్థానాలు అవుతాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, మహారాష్ట్ర ఈ నాలుగు రాష్ట్రాలలో గెలిస్తే చాలు దేశాన్ని పాలించవచ్చు. దక్షిణ భారత రాష్ట్రాలు ఈ దేశాన్ని పాలించే అవకాశం శాశ్వతంగా కోల్పోయి మైనారిటీ ప్రజలుగా, మైనారిటీ రాష్ట్రాలుగా మిగిలిపోతాయి. బీజేపీకి దక్షిణ భారతదేశంలో సమీప భవిష్యత్తులో బలం పెరుగుతుందనే నమ్మకం పోయింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న కర్ణాటక కూడా చేజారిపోయింది. ఈ నేపథ్యంలో ఉత్తర భారతదేశంలో సీట్లు పెంచుకోవటం ద్వారా లబ్ధిపొందాలని బీజేపీ చూస్తున్నది. కానీ అదే జరిగితే ఉత్తర, దక్షిణ భారత దేశాల ప్రజల మధ్య విభజనకు దారి తీస్తుంది. దక్షిణాది ప్రజలు తమకు అన్యాయం జరుగుతున్నదని బలంగా నమ్ముతారు. అది తిరుగుబాటుకు దారి తీస్తుంది. రాజకీయ వైషమ్యాలు పక్కన పెట్టి దక్షిణ భారత రాష్ట్రాల నాయకులంతా ఒక్కతాటిపైకి వచ్చి దేశంలో అన్యాయానికి గురవుతున్న అనేక చిన్న రాష్ట్రాలను కలుపుకొని ఉద్యమించకుంటే శాశ్వత బానిసలుగా మిగిలిపోవాల్సి వస్తుంది.

రాగి శ్రీనివాస్ రెడ్డి
99850 98432

కళకళలాడే నా తెలంగాణ

కళకళలాడేరా నా తెలంగాణ
జలక్రీడలాడేరా నా తెలంగాణ
కవుల కలములలో కవితలై పారగా
గాయకుల గళములో గళమెత్తి పాడగా

చెరువులు కుంటలు నిండుగా పారగా
తూములు అలుగులు వరదలై పారగా
చెరువునిండి భూములు పండగా
పచ్చని పొలాలు సిరులతో పండగ

ఎండిన గొంతులకు తాగునీరందింప
పంట పొలాలకు సాగునీరందింప
మిషన్ కాకతీయతో చెరువులు నింపగా
మిషన్ భగీరథతో తాగునీరు పంపగా

పెట్టు బడికి రైతుబంధు తోడ్పడ
కర్షకుల మోములో హర్షంబు చూడగా
పాడిపంటలతో పరుగులెడుతుండగా
ఎవుసం నేడు పండుగను తలపింప

నిరుపేద కన్యలకు కల్యాణలక్ష్మి
ముస్లిం సోదరీలకు షాదీ ముబారక్
ఆసరా పింఛన్లు హర్షంబునందగా
బలహీన వర్గాల సంక్షేమం కోరగా

జై తెలంగాణ జైజై తెలంగాణ
జయమని పలకరా నా తెలంగాణ
కోటి రతనాల నా తెలంగాణ
కోటి పథకాల నా తెలంగాణ

ఎం ఏ గఫార్
94903 24834

హుస్నాబాద్ నుంచే శంఖారావం

కేసీఆర్ గొంతెత్తితే ప్రతిపక్ష పార్టీల్లో భూకంపమే. వ్యూహానికే నడక నేర్పిన వ్యూహకర్త కేసీఆర్. ప్రతిపక్షాలు ఎన్ని పద్మవ్యూహాలతో వచ్చినా వాటిని ఛేదించే మహా ఉద్యమ వ్యూహం ఆయనకు ఉంటుంది. మొండికి జగమొండిలా భీకరపోరుకు సిద్ధం అంటూ సవాల్ విసిరే తెలంగాణ పోరాట యోధుడు కేసీఆర్. గత రెండు ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి ఎన్నికల శంఖారావం పూరించిన కేసీఆర్ ముచ్చటగా మూడోసారి అక్కడినుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు.

బతుకమ్మ పండుగ రోజు తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో, విజయదశమి రోజున జమ్మి చెట్టు నుంచి ఆయుధాలు దించుతుండు కేసీఆర్. ఇక కాసుకోండి. అమ్ముల పొదిలో నుంచి వచ్చే తెలంగాణ యోధుని బాణం కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో దిగటం ఖాయం. భారత రాష్ట్ర సమితి విజయాధినేత దూసుకు వస్తున్నడు. యుద్ధానికి సిద్ధంగా ఉండండి. దీపావళి రోజు ప్రతిపక్ష నరకాసురుల భరతం పట్టి, కార్తీక మాసం కోటి కాంతుల వెలుగుల్లో నాలుగు కోట్ల జనం సాక్షిగా మూడోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయబోయేది కేసీఆరే.

నాడు తెలంగాణ ఉద్యమంలో తన మేధోసంపత్తిని పాయలుగా విభజించి ఎత్తులకుపై ఎత్తుల వ్యూహంతో తెలంగాణకు అడ్డుపడే దుష్టశక్తులను తుదముట్టించిన యుద్ధ వీరుడు కేసీఆర్. లేకుంటే ఉమ్మడి రాష్ట్ర దోపిడీదారుల నుంచి తెలంగాణ విముక్తి అయ్యేదా? కేసీఆర్ ఉద్యమం ప్రపంచానికి మార్గదర్శకం. ఎన్నో త్యాగాలు, కేసీఆర్ అకుంఠిత దీక్షతో ముక్కోటి తెలంగాణ జనమంతా ఒక్కటైన చేతనం. సీఎం కేసీఆర్ నేటి ఉజ్వల బంగారు తెలంగాణకు నిదర్శనం. పోరాట స్ఫూర్తితో తెలంగాణ తెచ్చారు. అదే స్ఫూర్తితో తెలంగాణ ప్రజల నిండైన దీవెనలతో పదేండ్లుగా తెలంగాణను బంగారు తునకలా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌ది.

ఆ ఒక్క గొంతు తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదింది. అందు కే కేసీఆర్ గొంతు తెలంగాణ ఊపిరి. కేసీఆర్ గొంతు తెలంగాణ ఉద్యమ గర్జన. ఆ గొంతు వింటే ధైర్యం. ఆ గొంతు వింటూంటే మస్తిష్కం పునరుత్తేజం అవుతుంది. ఆ గొంతు సింహగర్జన చేస్తుంటే నరనరాల్లో రక్తం ఉరుకలేసి ప్రవహిస్తుంది. ఆ గొంతు స్వచ్ఛమైన ప్రేమను ఆప్యాయతను పంచుతుంది. ఆ గొంతు మరోసారి హుస్నాబాద్ వేదికగా గర్జించనున్నది. ఇప్పటికే సీఎం కేసీఆర్ గత ఆగస్టు నెల 21న 115 మంది అభ్యర్థులను ఒకేసారి ప్రకటించి రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయి. పదేండ్ల ప్రగతి పథం నేటి ఎన్నికల నినాదం. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రతి ఇంటికి చేరాయి.మళ్ళీ సీఎం కేసీఆర్ సార్ రావాలని తెలంగాణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. అరవై యేండ్ల పరాయి పాలనకు పదేండ్ల కేసీఆర్ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించారు. పదేండ్లలో సాధించిన ప్రగతి వందేండ్లకు సరిపోయేలా తీర్చిదిద్దిన తీరును ప్రజలు అర్థం చేసుకున్నారు. ఉమ్మడి పాలనలో సాధ్యం కాని కాళేశ్వరం, పాలమూరు-రంగారెడి ఎత్తిపోతల పథకాలు పూర్తి కావటంతో రైతులు ఆనందంతో ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం, దిశానిర్దేశంతో గడచిన 20 రోజులుగా విరామం లేకుండా మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు తెలంగాణ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. జిల్లాల్లో పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలు చుట్టేశారు.తమ వాగ్ధాటితో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ అంతట గులాబీ పవనాలు వీస్తున్నాయి. ఎక్కడ చూసినా కారు స్పీడు గులాబీ హోరు కనిపిస్తున్నది. ప్రతి పక్ష పార్టీలకు అందనంత దూరంలో బీఆర్ఎస్ దూసుకపోతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎన్నికల వాతావరణం వేడెక్కిస్తున్నారు.

కేసీఆర్ ప్రచార కార్యక్రమాల షెడ్యూల్ కూడా ఖరారైంది. మోడీ, షా, రాహుల్, సంజయ్, రేవంత్, అరవింద్, అరుణ, షర్మిలా ఇలా రాజకీయ నాయకులందరికీ కేసీఆర్ ను తలుచుకోకుంటే పూట గడవదు. వాళ్లందరిదీ రాజకీయ అజెండా. కానీ కేసీఆర్‌ది ప్రజల అజెండా. ప్రజల సంక్షేమం కోసమే ఆయన నిరంతరం కృషి చేస్తారు. ఏదైనా పథకం ప్రవేశ పెట్టే ముందు అనేకసార్లు అధ్యయనం చేస్తారు. ఏ పథకమైనా, ప్రాజెక్ట్ ఐనా అందులో ఉండే సాధకబాధకాలు, అవసరమయ్యే నిధులు, వాటి అమలు తీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసి అమలు చేస్తారు. అందుకే ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఆదివారం ప్రకటించే ఎన్నికల మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు, జీవితాలకు దగ్గరగా ఉంటుంది. రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీనవర్గాలకు కోసం కేసీఆర్ చారిత్రాత్మక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించబోతున్నారు.

హుస్నాబాద్ గడ్డమీద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలి సభ ఉండబోతున్నది. 2014, 2018లో ఇక్కడి నుండే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే సెంట్‌మెంట్‌ను కొనసాగిస్తూ మూడోసారి విజయ దుందుభి మోగించడం కోసం మరోసారి అక్కడి నుంచే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తునారు. తొలిసభతో పాటు వరుసగా 17 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ పర్యటించనున్నారు.

చిటుకుల మైసారెడ్డి
94905 24724